క్లుప్తంగా

62 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులు

నారాయణఖేడ్: శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఖేడ్ ప్రాంతానికి చెందిన 62 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. హైదరాబాద్ నానక్‌రాం గూడలోని శంకర కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో ఈనెల 23న ఖేడ్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 127 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 72 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి శంకర ఆస్పత్రిలో 62 మందికి శస్త్రచికిత్సలు చేయించి శనివారం వారిని ఖేడ్‌కు తీసుకువచ్చారు. మిగిలిన 10 మందిని ఈ నెల 27 తీసుకెళ్లి ఆపరేషన్ చేయించనున్నట్లు శ్రీసత్యసాయి సేవల సంస్థ జిల్లా కన్వీనర్ శంకరప్ప తెలిపారు. ప్రతినెల నిర్వహించే ఉచిత కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సురేష్

నారాయణఖేడ్: కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పేర్కొన్నారు. గీత కార్మిక సంఘానికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గౌడ సోదరుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజన్ గౌడ్, సంఘం ఇతర బాధ్యులు మాణిక్‌గౌడ్, రాంచందర్ గౌడ్, సుదర్శన్‌గౌడ్, దాస్‌గౌడ్, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పుచ్చకాయ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్ టౌన్: ఏరువాక కేంద్రం సంగుపేట శాస్త్రవేత్తలు శనివారం మండలంలోని రంజోల్ గ్రామపరిధిలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ, ఏఈఓ ప్రదీప్‌కుమార్ ఆలుగడ్డ, పుచ్చకాయ, శనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్ విశ్వకర్మ ఆలుగడ్డ పంటసాగులో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. శనగ పంటకు పచ్చపురుగు ఆశించడాన్ని గమనించారు. లీటర్ నీటిలో 0.3మిలీ క్లోరంత్రినిలిప్రోల్ మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పుచ్చకాయ సాగులో సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

కండక్టర్ శంకర్‌కు నేతాజీ పురస్కారం



అవార్డును అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాస్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కండక్టర్ శంకర్‌కు హైదరాబాద్ కొమ్మూరి చారిటబుల్ ట్రస్ట్ వారు నేతాజీ సుభాష్ చంద్రబోస్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. ఆర్టీసీలో అందించిన సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శంకర్‌కు ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ జైపాల్, రాందాస్ ప్రశంసాపత్రం, అవార్డును అందజేశారు.

'మహా ప్రదర్శన'ను విజయవంతం చేయండి

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం నిర్వహించే లక్షల డప్పులు.. వేల గొంతుల మహాసభను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జైరాజ్ మాదిగ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఉల్లాస్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష డప్పుల మహా ప్రదర్శనకు ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని చెప్పారు. జహీరాబాద్ ప్రాంతం నుంచి డప్పులతో కదలివెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సోషలిస్ట్ పార్టీ నాయకులు దాస్, జీవన్, ప్రభాకర్, లాజర్, నిర్మల్, విల్సన్, అరుణ్, శ్రీనివాస్, మనోజ్, రాజు నాయీబ్రహ్మణ సంఘం పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆర్డీఓ రాంరెడ్డి తదితరులు



నారాయణఖేడ్ పట్టణంలో..



పటాన్‌చెరు టౌన్‌లో..

నీ ఓటే.. నీ భవిష్యత్

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ ఓటర్ల చేతిలో ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నమోదు చేసుకొని.. సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.



జహీరాబాద్ టౌన్: బాగారెడ్డి స్టేడియంలో ఓటర్లతో ప్రమాణం చేయిస్తున్న ఆర్డీఓ రాంరెడ్డి



కంగ్టి: ర్యాలీగా వెళ్తున్న అధికారులు, విద్యార్థులు



జోగిపేటలో ప్రసంగిస్తున్న ఆర్డీఓ పాండు



జిన్నారంలో..

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

నారాయణఖేడ్: గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం ఖేడ్‌లో విద్యార్థుల ప్రదర్శించనున్న ఆయా కార్యక్రమాల కోసం శనివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్డీఓ అశోక చక్రవర్తితో కలిసి తహసీల్ గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సాహక అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. పచ్చదనం.. పరిశుభ్రతపై పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, భారతరాజ్యాంగంపై క్విజ్ పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్‌ఫాస్ట్‌లో పాటు పాల్గొన్న అన్ని పాఠశాలలకు ధ్రువపత్రాలు అందజేస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల కోసం తహసీల్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అలాగే, ఖేడ్ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీయువకులు ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కలిసి గ్రంథాలయ సమయాన్ని పెంచాలని కోరారు. మున్సిపాలిటీ నుంచి ఒకరిని తాత్కాలిక



తహశీల్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్డీఓ తదితరులు

అటెండర్‌గా ఏర్పాటు చేయించి, సమయం పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో మంజూరైన బీసీ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయిస్తామని వారికి హామీనిచ్చారు. బల్కం చెల్క తండాకు చెందిన జెంబ్లీబాయికి కల్యాణలక్ష్మి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఎంఈఓ మన్మథకిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో మున్సిపాలిటీ అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మున్సిపల్ పాలకవర్గం నిరంతర కృషి.. ప్రజల భాగస్వామ్యంతో అమీన్‌పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన పాలకవర్గం వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న అమీన్‌పూర్ గ్రామాన్ని మున్సిపాలిటీగా మార్చామని తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో మున్సిపాలిటీ శరవేగంగా విస్తరించిందని చెప్పారు. ఇందుకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశామన్నారు. దశాబ్దకాలంగా అపరిష్కృతంగా ఉన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు చెప్పారు. మున్సిపల్ పరిధిలో 80% పైగా అభివృద్ధి చేశామని పాలకవర్గ సభ్యులు తెలియజేయడం సంతోషమని అన్నారు. అనంతరం పాలకవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ చివరి సమావేశం గరంగరం

సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ వద్దంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల డిమాండ్

సదాశివపేట (సంగారెడ్డి): ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సహకారంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.150 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయని మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ, వైస్ చైర్మన్ చింతా గోపాల్ పేర్కొన్నారు. శనివారం చైర్‌పర్సన్ అపర్ణ అధ్యక్షతన చివరి సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, పట్నం సుభాష్ కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశ హాల్‌లోకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు ఎమ్మెల్యే ప్రభాకర్ వత్తాసు పలుకుతూ వెంచర్ పక్కనున్న డంపింగ్ యార్డ్‌ను సిద్ధాపూర్‌లోని 262 సర్వే నంబర్‌లోని 10 ఎకరాల్లోకి తరలించేందుకు అధికారులను ఆదేశించారని ఆరోపించారు. డంపింగ్ యార్డును తరలించే



డంపింగ్ యార్డ్ ఏర్పాటు వద్దని డిమాండ్ చేస్తున్న కౌన్సిలర్లు

కౌన్సిల్ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ అలియాస్ మాట్లాడుతూ.. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని నివారణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కౌన్సిలర్లు రవి, రాజేశ్వరీ మాట్లాడుతూ.. 16 మున్సిపల్ దుకాణాలు 40ఏళ్లుగా కొంతమంది వ్యాపారులు కబంధ హస్తాల్లోనే ఉన్నాయని వెంటనే బహిరంగ వేలం పాట నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం చైర్ పర్సన్ అపర్ణ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లను సన్మానించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

వట్‌పల్లి(అందోల్): జనవరి నాటికి కొత్త పట్టాదారు పాసు పుస్తకం కలిగి ఉన్నవారు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ ప్రవీణ్ అన్నారు. శనివారం మండలంలోని దేవునూర్ రైతువేదిక భవనంలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26న రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుందన్నారు. దరఖాస్తు చేసుకునేవారు అప్లికేషన్ ఫారంతో పాటు పట్టాపాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు జిరాక్స్ పత్రాలను అందజేయాలని కోరారు. రైతులు బ్యాంకు వివరాలను మార్చుకునేవారు కూడా అందజేయాలని తెలిపారు.

ఏఈఓలకు దరఖాస్తును అందించండి

నారాయణఖేడ్: కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందిన వారు ఈ నెల 1 వరకు భూ భారతి పోర్టల్‌లో



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఈఓ ప్రవీణ్

రైతు భరోసా కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏడీఏ నూతన్ కుమార్ తెలిపారు. ఇప్పటికే రైతు భరోసా పొందుతున్న వారు దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదని, బ్యాంకు అకౌంట్ నంబర్లు మార్పు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శంకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యార్థులు చదువులో రాణించాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పనిసరిగా ఉండాలని ఎంఈఓ శంకర్ పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలు ఎలా చదువుతున్నారు. వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయి. అనే విషయాలను తల్లిదండ్రులు తెలుసుకోవాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు వస్తే పిల్లల సామర్థ్యం తెలుస్తుందని వివరించారు. పాఠశాలలో విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు సునీత, నవనీతలను సమావేశంలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీఆర్పీ రాజేశ్వర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఘుమఘుమలు



గణతంత్ర దినోత్సవం సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన దేశభక్తిపై వ్యాసరచన, వంటలు, ముగ్గులపోటీల్లో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిరుధాన్యాలతో 114 రకాల వంటకాలను తయారుచేసి ఇలా ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతల హరికుమార్, అధ్యాపకులు వంటలను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు.

– జహీరాబాద్ టౌన్

వరద కాల్వలను పునరుద్ధరించాలి

పటాన్‌చెరు టౌన్: వరద కాల్వలను పునరుద్ధరించాలని నవ భారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. ముత్తంగి పరిధిలోని ఎంకె చెరువు వర్షాకాలంలో నిండటం వల్ల చిట్కుల్ పరిధిలోని నాగార్జున కాలనీ, డిఫెన్స్ కాలనీ, రాధమ్మ కాలనీలు ముంపునకు గురై కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలి కోరారు.

పాలకవర్గం సభ్యులకు సన్మానం



చైర్ పర్సన్‌ను సన్మానిస్తున్న పాలకవర్గం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పాలకవర్గ చివరి సమావేశాన్ని తాత్కాలిక కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ రోజా అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను కమిషనర్ మంగతయారు ఘనంగా సన్మానించారు. రోజా మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహకరించిన అధికారులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అనిల్ కుమార్‌రెడ్డి కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

15న సెలవు ప్రకటించాలి

నారాయణఖేడ్: గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు శనివారం సేవాలాల్ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు.

వైభవంగా రంగనాథ స్వామి కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న మంత్రి సతీమణి పద్మిని

జోగిపేట(అందోల్): అందోల్‌లోని భూనీల సమేత రంగనాథ స్వామి ఆలయంలో వేదపండితులు శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని మున్సిపల్ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు–రాధిక, వ్యాపారి బందం కిషోర్ దంపతుల చేతుల మీదుగా జరిపించారు. కార్యక్రమానికి మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి పద్మిని హాజరయ్యారు. ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బ్రాహ్మణులు ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.సునిత, మాజీ కౌన్సిలర్ ప్రదీప్‌గౌడ్, ఆలయ పూజారి శ్యామ్, కమిటీ సభ్యులు రామకృష్ణ, మల్లేశం, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మాంసం దుకాణాదారులకు నోటీసులు

నారాయణఖేడ్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మాంసం విక్రయాలు చేయొద్దంటూ శనివారం ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మాంసం దుకాణాలు, హోటళ్ల యజమానులకు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ నోటీసులు అందజేశారు. మాంసం విక్రయించినా, మాంసంతో కూడిన భోజనాలు పెట్టినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

◆ ఉపాధి పనులపై అవగాహన

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధిహామీ పథకంలో చేపట్టే వివిధ పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజు తెలిపారు. శనివారం కొండాపూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరంలో చేసిన పనులపై ఆడిట్ బృందం తనిఖీలు చేశారు. అడిషనల్ డీఆర్డీఓ మాట్లాడుతూ.. మండలంలో గత సంవత్సరం రూ.3 కోట్ల 80 లక్షలు పనులు జరిగాయని, వీటిలో రూ.30 వేలకు సంబంధించి రికవరీ చేయాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో డీవీఓ నాగేశ్వర్ రావు, క్వాలిటీ అధికారి శ్రీలత, అసిస్టెంట్ పీడీ పూజ, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఎస్ఆర్‌పీ కవిత, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు నాలుగు పథకాల అమలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని గాంధీనగర్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ పథకాలు ఆదివారం అమలు చేయనున్నట్లు తహసీల్దార్ నజీమోద్దిన్ తెలిపారు. మండలంలో గిరిజన తండాలు మినహాయిస్తే అత్యంత తక్కువ జనాభా కల్గిన గ్రామ పంచాయతీ గాంధీనగర్ కావడం విశేషం. గతంలో జమ్గి(బీ) గ్రామపంచాయతీలో మధిర గ్రామంగా ఉన్న గాంధీనగర్ 2018లో నూతన పంచాయతీగా ఏర్పాటైంది.

◆ కేసుల వివరాలు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి

సంగారెడ్డి టౌన్ : కోర్టు పెండింగ్ కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని హైకోర్ట్ న్యాయమూర్తి రాధారాణి అన్నారు. శనివారం సంగారెడ్డిలోని జిల్లా కోర్టులో ఆన్‌లైన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాత కేసులు, కొత్త కేసులకు సంబంధించిన అన్ని వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. అనంతరం జిల్లా కోర్టులో తనిఖీలు నిర్వహించారు. కందిలోని సెంట్రల్ జైలులో ఖైదీలకు హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పథకాల ప్రారంభం

వట్‌పల్లి(అందోల్): మంత్రి రాజనర్సింహ ఆదివారం నాలుగు ప్రభుత్వం పథకాల అమలు కార్యక్రమంలో పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని అధికార వర్గాలు శనివారం తెలిపాయి. రేషన్‌కార్డుల పంపిణీ, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలను పంపిణీ కార్యక్రమానికి అందోల్ మండలం నేరడిగుంట గ్రామాన్ని ఎంపిక చేయడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన లబ్ధిదారుల ఎంపికను చేపడుతున్నారు. దీంతో అధికారులు దరఖాస్తుదారుల ఇళ్లకు తిరుగుతూ లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో గ్రామసభను నిర్వహించి పథకాలను అందజేయనున్నారు. లబ్ధిదారులుగా ఎంపిక చేస్తుండడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

